





# అందినపండు

త్రిపుర—

"శారదా! లక్ష్మీకాంత్ ఉత్తరం వ్రాశాడు."

"ఏం వ్రాశారండీ?" భర్తకు కాఫీ తీసుకొస్తూ అడిగింది శారద.

"ఇదిగో చదువు" అంటూ ఉత్తరం ఆమె కిచ్చి కాఫీ అందుకున్నారు మాధవరావుగారు.

"పిల్లలంతా ఏమయ్యారు? ఎక్కడా అలికిడే లేదు."

"సినిమాకు వెళ్ళారండీ" అని జవాబు చెప్పి ఉత్తరం చదవటంలో లీనమయింది శారద.

'మాధవ్,

మా వాడికి సంబంధాలొస్తున్నాయ్. ఈ సంవత్సరం పెళ్ళి చేసెయ్యాలనుకుంటున్నాను. నీతో మాట్లాడవలసిన పని వుంది. కనుక నీవు వీలు చూసుకుని రా.

లక్ష్మీకాంత్'

ఉత్తరం మడిచి అతని చేతికిస్తూ ప్రయాణం ఎప్పుడని అడిగింది శారద.

"శనివారం బయలుదేరి వెడతాను. బహుశా వచ్చిన సంబంధాలలో ఏది మంచిదో చూసి సెలెక్టు చెయ్యటానికేమో!"

* * *

"ఏమిటి....ఇంతకీ నాతో మాట్లాడవలసిన పని?" వచ్చిన మరుసటి రోజు అసలు సంగతేమిటో తెలుసుకుందామని అడిగారు మాధవరావు.

"నీకు తెలుసుగా వాడి సంగతి. ఒక్కడే కొడుకు గదా అని బాగా గారాబంగా పెంచేటప్పటికి చదువు సంధ్యా లేకుండా మొండిగా తయారయ్యాడు. చదువు అబ్బకపోయినా వ్యవసాయంలో బాగా రాటు తేలాడు. నన్ను మించిపోయాడు. వాడి పనీ, పాటా, సమర్థత చూసి మా పిల్ల నిస్తామంటే మా పిల్లనిస్తామని వస్తున్నారు. కాని వాడు ఏ సంబంధానికీ ఒప్పుకోవటంలేదు. ఏమిటిరా సంగతి? అని నిలదీసి అడిగితే చెప్పాడు: 'నాకు వాణి అంటే ఇష్టం. మాధవరావు మామయ్యను అడిగి చూడండి—వాళ్ళు కాదంటే మీకిష్టమైన సంబంధమే చేద్దురుగాని....'అని. 'వాణి బి. ఏ. పాసయిందిరా. నీకేమో చదువూ సంధ్యాలేవు. అలాంటి పిల్లనివ్వమని అడగటానికైనా సబబుగా ఉందా?' అంది వాళ్ళమ్మ.

"ఐనా వాడు మొండిపట్టు పట్టుకూర్చున్నాడు—ఏ సంబంధానికీ ఒప్పుకోకుండా. ఒకవేళ వాడికి చదువుకున్న పిల్లని చేసుకోవాలని ఉందేమో అనుకున్నాం. అలాగే స్కూల్ ఫైనల్ దాకా చదివిన పిల్లలనే ఇస్తామని వస్తున్నారు. కాని వాడికి వాణి ముందు ఎవరూ నచ్చటం లేదు. మొన్న నరసింహం కూతురి పెళ్ళిలో చూశాడుగా వాణిని. ఆ వచ్చేవాళ్ళంతా మన ఆస్తిని చూసి అంతంత కట్నాలు ఇస్తామని వస్తున్నారు. అయినా నాకు కట్నాలు అక్కర్లేదు. మామయ్య ఒప్పుకోకపోవటానికి నాకేం తక్కువ. ఆస్తి తక్కువా, అందం తక్కువా?, గుణం తక్కువా? ఎందుకొప్పుకోరు? అంటూ మొండి కేస్తున్నాడు.

"ఇక వాడికి నీనోటి మీదుగా నువ్వే చెప్పాలిరా. ఇక ఏం చెబుతావో ఎలా చెప్పుతావో నీ ఇష్టం. వాణికి పెళ్ళి స్థిరపడిందనో, లేకపోతే ఎవరినైనా ప్రేమించిందనో చెప్పు. నువ్వింకే విధంగా చెప్పినా వాడి మొండిపట్టు విడవడు."

"నీకు కట్నం మీద దృష్టి లేకపోతే నేను శారదను, వాణిని కనుక్కొని ఏ సంగతీ ఉత్తరం వ్రాస్తాను" అన్నాడు మాధవరావు.

"ఒరేయ్ నాకు కట్నం మీద ఆశ్రా. నా సంగతి నీకు తెలియదురా....నా మనసులో ఉన్నది — నేను బయట పడలేనిది వాడు బయట పడి అడగమని మొండిపట్టు పట్టాడు! వాణి నా కోడలైతే అంతకంటే నాకు కావల్సిందేముందిరా? నేను కోరుకునేదీ అదే!"

మాధవరావు తండ్రికి పెద్ద కొడుకు. అతనికి ఇంకా ఇద్దరు తమ్ముళ్ళు, ఇద్దరు చెల్లెళ్ళు ఉన్నారు. ఆస్తి కూడా బాగానే ఉంది. అతని మేనత్తకొడుకు లక్ష్మీకాంత్. పేరుకు తగ్గట్టే లక్ష్మీపుత్రుడు. మాధవరావుకంటె ఆరేళ్ళుపెద్ద. లక్ష్మీకాంత్ చెల్లెల్ని మాధవరావుకివ్వాలని చిన్నప్పటి నుంచీ అటూ ఇటూ అందరూ అనుకునేవారు. వయస్సులో చాలా తేడాఉన్నా మాధవరావు, లక్ష్మీకాంత్ మంచి స్నేహితులు.

లక్ష్మీకాంత్ తండ్రి పోవటంతో ఎస్. ఎస్. ఎల్. సి. తోనే చదువుకు స్వస్తి చెప్పి వ్యవసాయం చేపట్టాడు.

మాధవరావు బి. ఏ. చదువుతున్న రోజుల్లో శారదను ప్రేమించాడు. శారద సామాన్య కుటుంబీకురాలు. వాళ్ళకు పెద్ద ఆస్తి పాస్తులు లేవు.

మాధవరావు వివాహం చెయ్యాలని అతని తండ్రి నిశ్చయించినప్పుడు సంగతి బయట పెట్టాడు మాధవరావు.

" నీకిదేం బుద్ధిరా....లక్షల విలువజేసే లక్షణమైన పిల్లను కాదని—మీ అత్తయ్య ఏమనుకుంటుంది ? చిన్నప్పటినుండి అనుకుంటున్న సంబంధంకదా ! ఇప్పుడు కాదంటే ఊళ్ళో వాళ్ళంతా ఏమనుకుంటారు ?"

తండ్రి ఎన్ని అంటున్నా మాధవరావు జవాబు మాత్రం ఒకటే. " నేను శారదను తప్ప ఎవరినీ చేసుకోను."

" సరే అయితే దాన్నే చేసుకుని ఏడువు! ఈ ఆస్తిలో నీకు భాగంలేదు. ఈ ఇంటిలో కూడా నీకు స్థానం లేదు. ఇక ఈ గడపతొక్కకు. వెళ్ళు....నా కంటికి కనపడకు" ఆవేశంగా మాధవరావు తండ్రి.

తండ్రి పట్టుదల మాధవరావుకు తెలుసు. అయినా ఆ ఆస్తిని, తండ్రిని కాదని వెళ్ళి శారదను రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాడు. పెళ్ళయితే చేసుకున్నాడు కాని ఇంకా రిజల్ట్ రాలేదు. ఒకవేళ తను పాసయినా ఉద్యోగమిచ్చేనాథుడెవ్వడు ?

మామగారింట్లో ఉండటానికి అభిమానం అడ్డొచ్చింది. మరో వీలులేక శారదను మాత్రం అక్కడే ఉంచాడు. తను మాత్రం పస్తులతో రోజులు గడుపుతూ ఉద్యోగాల వేట సాగించాడు. ఏ ఉద్యోగమూ దొరకక నిరాశతో చివరికి రైస్‌మిల్లులో కూలీగా చేరాడు. ఉద్యోగం దొరికిందని చెప్పి శారదను తీసుకెళ్ళి కాపురం పెట్టాడు. అలాగే రోజులు గడుస్తున్నాయ్. ఓరోజు అలాగే రైస్ మిల్లులో కూలీగా లక్ష్మీకాంత్ కళ్ళబడ్డాడు.

" ఒరేయ్ మాధవ్ ఏమిటిరా ఇది ? నీకేదో ఉద్యోగం దొరికిందని చెప్పుకుంటున్నారు కదరా మన ఊళ్ళో. అయితే నువ్వు చేసే ఉద్యోగం ఇదన్నమాట."

" అవునురా ఏదైతేనేం. ఏ ఉద్యోగమైనా ఒకడిక్రింద నౌకరీయేగా. కష్టపడి పని చేస్తున్నాను. తృప్తిగా బ్రతుకుతున్నాను. శారదా నేను ఎంత హాయిగా ఉన్నామో మా ఇంటికి వచ్చి చూస్తే నీకే తెలుస్తుంది. ఇంతకీ నువ్వెందుకొచ్చినట్లు ?"

" ఈ మిల్లులో షేర్స్ అమ్ముతున్నారంటే వివరాలు కనుక్కోవటానికి వచ్చాను. అవును.... ఆ షేర్స్ ఏవో నీవే కొనగూడదూ" అంటూ 50 వేలు పెట్టి మాధవరావు పేర ఆ షేర్స్ కొని ఇంటికి వెళ్ళిపోయాడు లక్ష్మీకాంత్.

లక్ష్మీకాంత్ – మాధవరావు చెల్లెల్ని పెళ్ళి చేసుకున్నాడు. తన చెల్లెల్ని మాధవరావు తమ్ముడికిచ్చి చేశాడు.

అలాగే రోజులు గడుస్తున్నాయి. లక్ష్మీకాంత్‌కి ఒక్కడే కొడుకు పుట్టాడు. ఆ తరువాత ఇక పిల్లలు లేరు.

మాధవరావుకి వరుసగా నలుగురు ఆడ పిల్లలు పుట్టారు. ఇక తనకి మగపిల్లలు పుట్టే యోగ్యత లేదేమోనని ఇక సంసారం మరీ పెద్దది కావడం ఇష్టం లేక తనే ఫుల్‌స్టాప్ పెట్టాడు.

సిటీలో ఉంటున్నాడు. పైగా పిల్లల చదువులు. మిల్లుమీద వచ్చే ఆదాయానికీ ఖర్చుకీ సరిపోతుంది. ఇక పిల్లల పెళ్ళిళ్ళకంటూ పెద్దగా ఏం మిగల్చలేక పోతున్నాడు.

పెద్దకూతురు వాణి బి. ఏ. పాసయిన రోజున "నాన్నా....ఎమ్. ఏ చదవనా ?" అని అడిగింది.

" వద్దమ్మా....ఈ బి. ఏ. కే నీకు తగిన పెళ్ళి కొడుకులను తీసుకు రాలేకపోతున్నాను. ఎప్పటికైనా ఏదైనా సంబంధం దొరుకుతుందని ఆశైనా ఉంది. ఇక ఆ ఎమ్. ఏ. చదివావంటే ఇక ఈ జన్మలో నీకు తగినవాణ్ణి తెచ్చి పెళ్ళి చెయ్యలేను" అన్నాడు మాధవరావు.

అంతే. వాణి బి. ఏ. తోనే చదువుకు స్వస్తి చెప్పింది. అలా రెండేళ్ళు గడిచిపోయాయి.

తరువాత పిల్ల రాణి బి. ఎస్ సి. ఫస్ట్ ఇయర్ చదువుతుంది. మిగిలిన ఇద్దరూ స్కూల్లో చదువుకుంటున్నారు.

*  *  *

"ఏమిటండీ అక్కడి కబుర్లు !" భర్తను అడిగింది శారద.

" వాణినిలా పిలు అది కూడా వింటుంది."

"ఏమిటినాన్నా ఇక్కడే ఉన్నా నేను కూడా.... వేణుకు పెళ్ళి కుదిరిందా ?"

" ఇంకా లేదమ్మా. వాడొక చదువుకున్న అమ్మాయిని ప్రేమించాడు. కట్నం బాగా ఇచ్చేవాళ్ళే వస్తున్నారు పోటీలుపడి. అయినా తనకి కట్నం అక్కర్లేదట. ఆ అమ్మాయినే చేసుకోవాలని ఉందట. ఆ అమ్మాయి ఇష్టపడని పక్షంలో వేరే అమ్మాయిని చేసుకుంటాడట. అదీ కట్నం లేకుండానే. వాడేమో చదువుకోలేదు. మరి ఆ అమ్మాయి ఇష్టపడుతుందా అని ఆలోచిస్తున్నాం—లక్ష్మీకాంత్, నేనూ."

" ఎంత డబ్బున్నా తమ హోదాకు సరిపడా కట్నం కోరుకునే ఈ రోజుల్లో కానీ కట్నం లేకుండా చేసుకుంటాననటం గొప్ప సంగతే. ఈ చదువులలో, డిగ్రీలలో, అంతస్తులలో కనపడని సంస్కారం అతనిలో కనబడుతోంది. ప్రేమించటానికి కూడా ఆస్తులు, అంతస్తులు చూసే ఈ రోజుల్లో పేద పిల్లను ప్రేమించటమూ విశేషమే మరి" అంది శారద.

" ప్రేమించింది మన వాణినే శారదా !"

" ఆఁ ! మన అమ్మాయినా ! చూస్తూ చూస్తూ అలా చదువులేనివాడికి ఎలా ఇస్తామండీ ?"

" చూస్తూ చూస్తూ ఇవ్వలేమనుకో .... మన తాహతుకు తగ్గట్టు ఏ పదివేలో కట్నం ఇచ్చి చదువుకున్నవాడని చెప్పి ముక్కూ మొగం తెలియనివాడికిచ్చి చేస్తే మన అమ్మాయి సుఖపడుతుందని గ్యారంటీ ఏమిటి ? వాడు ఏ తాగుబోతో, తిరుగుబోతో, జూదరో అయితే ఏం చేస్తాం ? వేణు బుద్ధిమంతుడు. మన కళ్ళెదటి వాడు. వాడు చదువుకోలేదు. అంతేగా-ఏం లోపం వాడికి ?"

"అయితే మాత్రం చూస్తూ చూస్తూ నాకేం మనస్కరించటం లేదండీ ! ఆస్తి లేకపోయినా అందం లేకపోయినా చదువూ గుణం ఉంటే చాలండీ."

"అవును శారదా ! అలాంటి వాళ్ళకోసం

వెతుకుతూనే ఉన్నాం కదా! చదువుకున్న వాళ్ళలో అలాటి గుణాలు కనబడ్డం లేదు. అధమం ఏ ఒకడిలోనైనా కనిపించినా వాడి అమ్మా అయ్యా ముక్కుకు తాడేసి లాక్కుపోతున్నారు. శారదా! నేను నిన్ను చేసుకునేటప్పుడు ఏమాశించి చేసుకున్నాను? అప్పుడు నాకు ఉద్యోగం లేదు. డిగ్రీ కూడా చేతికి రాలేదు. తప్పు ఒప్పు అనుకోకుండా రైస్ మిల్లులో బస్తాలు మోయలేదూ? ఆ రోజుల్లో నాకు—నా కాళ్ళ మీద నేను నిలబడగలను; నా భార్యా బిడ్డలను నేను పోషించుకోగలను—అన్న ఆత్మ విశ్వాసం వుండేది. ఈ రోజుల్లో ఎవరిలోనూ ఆ ఆత్మస్థైర్యం కనబడటం లేదు.''


''అందరూ మీలాగే ఉంటారండీ?''

''అదే నేనూ అనేది. అయినా లక్ష్మీకాంత్‌కి 'ఒరేయ్ నీ కూతురిని నా కొడుక్కి చేసుకుంటానురా' అని అనగలిగే హక్కుంది. ఎందుకంటే ఈ రోజు మనం తింటున్న తిండీ, కట్టుకున్న బట్టా వాడి చలవే. ఆ రోజు 50 వేలు అప్పుగా ఇచ్చి ఆ మిల్లులో షేర్స్ నా చేత కొనిపించకపోతే ఈ రోజు ఏ స్థితిలో ఉండేవాళ్ళం? అయినా వాడు అలా కోరలేదు. వాణి ఎవరినైనా ప్రేమించిందనో పెళ్ళి నిశ్చయమైందనో చెప్పమన్నాడు వేణుకు. వాడికున్న సంస్కారం మనకి లేదు. ఏమ్మా వాణీ! ఇంతకీ నీ సంగతేమిటి? మీ అమ్మకెంతమాత్రం ఈ పెళ్ళి ఇష్టం లేదని తెలుస్తూనే ఉంది. మరి నీ అభిప్రాయం చెప్పు. మా ఇష్టాయిష్టాల కంటె నీ అభిప్రాయం ముఖ్యం."

''నా కిష్టమే నాన్నా!'' తక్కున చెప్పింది వాణి: ''మనం కావాలని కోరుకునే వాళ్ళెవరూ మన కందరు. మనని కావాలి అనుకునే వాళ్ళను దూరం చేసుకోవటం అవివేకం. అందని పళ్ళకోసం ఎగిరి, కాళ్ళు విరగగొట్టుకునేకన్నా అందిన పళ్ళతో తృప్తి పడటం మంచిది కాదా అమ్మా?''

అమ్మాయి ధోరణిని చూసి, మాధవరావూ శారదా ఒక్క నిమిషం అలాగే వుండిపోయారు! దూరంగా ఎక్కడి నుంచో వినిపిస్తున్న పెళ్ళి బాజాలు, వాళ్ళ ఇంట్లోనే వినిపిస్తున్న భావన కలిగింది!

'ప్రతి ఆడపిల్లా, నా కూతురిలా ఆలోచిస్తే తల్లిదండ్రులకు ఆడపిల్లల పెళ్ళిళ్ళు భారమనిపిస్తాయా!' అనుకున్నాడు మాధవరావు. □




[వనిత 'స్నేహ పీఠం' ద్వారా స్నేహితులై - వారి వారి అభిరుచుల మీద, వివిధ విషయాల మీద లేఖలు రాసుకుంటున్న మిత్రులు — వారి లేఖలు పాఠకులకు ఉత్సాహకరంగా వుండగలవని అనిపిస్తే మిత్రురాలితో సంప్రతించి, (తొలి నుంచీ వున్న ఇద్దరి ఉత్తరాలనూ) ప్రచురణకు పంపవచ్చును. తగిన స్టాంపులు అతికించిన కవరు కూడా పంపితే, ప్రచురణ కాని పక్షంలో—భద్రంగా తిప్పి పంపివేస్తాము. —వ. సం]

శ్రీమతి కోట సూర్యలక్ష్మి

**వైఫ్ ఆఫ్ శ్రీ కె. ఇ. వి. సుబ్బారావు, డోర్ నెంబర్ 12–78 రెండవ వీధి, ప్రకాశనగర్, రాజమండ్రి–3.**

చిన్నతనంలోనే వివాహమైంది. వయసు 19 సం. లు. చిన్న చిన్న వ్యాసాలు రాయడం, ఎంబ్రాయిడరీలు, కుట్లు నేర్చుకోవడం 'కలం స్నేహం' చెయ్యడం హాబీలు. చారిత్రాత్మకమైన స్థలాల గురించి, కట్టడాల గురించీ తెలుసుకోవడంలో ఉత్సాహం చూపుతారు.

కుమారి చెరుకూరి రుక్మిణీదేవి

**కేరాఫ్ శ్రీ చెరుకూరి లక్ష్మణరావు, స్టీమరు రోడ్డు, నరసాపురం (ప. గో. జిల్లా)**

వయసు 18 సం. లు. యస్. యస్. సి. చదువుకున్నారు. సంగీతాభ్యాసం చేస్తున్నారు. ఆటల్లో ఉత్సాహం వున్నది. ముఖ్యంగా విదేశీయ వనితలతో స్నేహాన్ని కోరుతున్నారు.

కుమారి బి. సూర్యకళ

**కేరాఫ్ శ్రీమతి బి. గోవిందమ్మ, గాంధీనగర్ కాకినాడ–4.**

ఇంటర్‌మీడియేట్ చదువుతున్నారు. ఎంబ్రాయిడరీలు, కుట్లు, అల్లికలు బాగా వచ్చును.

కుమారి జె. ఇందులక్ష్మి

**డాటర్ ఆఫ్ శ్రీ జె. మురళి, వాచ్ రిపైరర్, కుమ్మర వీధి, పాలకొండ (శ్రీకాకుళం జిల్లా)**

17 సం. లు. వయసు. మెట్రిక్ చదివారు. రకరకాల ఎంబ్రాయిడరీలు చెయ్యడం తెలుసు.

కుమారి జి. రామలక్ష్మి

**డాటర్ ఆఫ్ శ్రీ జి. మల్లికార్జునరావు, 3–5–695 న్యూ నారాయణగూడా, హైద్రాబాదు–29.**

20 సం. లు. వయసు. రచయిత్రి. వందకుపైగా రచనలు చేశారు. నవలలు రాశారు. కొత్తరకాల వంటలు, చిత్రలేఖనం తెలుసు. పూసలతోనూ, గాజు సీసాలతోనూ, బొమ్మలు, ముగ్గులు వేస్తారు. బట్టలమీద పైంటింగ్ చెయ్యడం, కుట్లు, అల్లికలు కూడా తెలుసు. రేడియో కార్యక్రమాల్లో కూడా పాల్గొంటూ వుంటారు.

కుమారి రాధికాప్రియ ఎమ్. ఎ.

**కేరాఫ్ శ్రీ యస్. జనార్దన గుప్త, కలికిరి 517234 (చిత్తూరు జిల్లా)**

19 సం. లు. వయసు. ఉద్యోగం చెయ్యడం లేదు. ఫోటోగ్రఫీ, చిత్రలేఖనం ఇష్టం. పుస్తకాలు చదువుతారు. రకరకాల వంటలు చెయ్యడంలో, కూరగాయలు పండించడంలో శ్రద్ధ చూపుతారు.

కుమారి యమ్. మాధవి

**డాటర్ ఆఫ్ శ్రీ యమ్. వెంకటరత్నం, అడ్వకేట్, తాడేపల్లిగూడెం.**

17 సం. లు. వయసు. డిగ్రీకోర్సు చదవబోతున్నారు. కథలు రాసేవాళ్ళందరూ అభిమానులే. రాయాలన్న ఉత్సాహం వున్నది. పెయింటింగ్ తెలుసును. లేఖలు రాయడంలో చాలా శ్రద్ధ వున్నది.

కుమారి బి. ప్రభ

**డాటర్ ఆఫ్ శ్రీ బి. జనార్దనరావు, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్, రెండవ లైన్, పండరీపురం, గుంటూరు-522002.**

బి. యస్ సి. చదివారు. 21 సం. లు. వయసు. చిత్రలేఖనం, పెయింటింగ్స్‌లో ప్రవేశం వుంది. గృహాలంకరణలో శ్రద్ధ వున్నది. రకరకాల ముగ్గులు వెయ్యడంలో ఉత్సాహం చూపుతారు.